క్లుప్తంగా

రూ.8 లక్షలతో సీసీ రోడ్డు



రోడ్డు పనులకు పూజా కార్యక్రమాలు నిర్వహించిన కార్పొరేటర్ ఆదిలక్ష్మి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): డివిజన్‌లోని అన్ని రోడ్లు, డ్రెయిన్లను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామని 48వ డివిజన్ కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్‌లోని ఆళ్ల నాగయ్య వీధిలో రూ.8 లక్షల వ్యయంతో చేపట్టిన రోడ్డు, డ్రెయిన్ అభివృద్ధి పనులకు కార్పొరేటర్ మంగళవారం పూజా కార్యక్రమాలను నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ డివిజన్‌లో ఎంతో కాలంగా అభివృద్ధికి నోచని డ్రెయిన్లు, రోడ్లను తొలి ప్రాధాన్యం కింద అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. డివిజన్‌లోని అన్ని రోడ్లు, డ్రెయిన్లను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి అత్తులూరి పెదబాబు, దుక్కా హరి, భాస్కర్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత చదరంగం శిక్షణ తరగతులు

విజయవాడ స్పోర్ట్స్: సంక్రాంతి సెలవులను పురుస్కరించుకుని పాఠశాలల విద్యార్థులకు చెస్ ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు ఎస్ఆర్ఆర్ చెస్ కోచింగ్ అకాడమీ డైరెక్టర్, జాతీయ ఆర్బిటర్ పి.రేణుకా తెలిపారు. అజిత్‌సింగ్‌నగర్, మారుతీనగర్, పోరంకి ప్రాంతాల్లో ఈ నెల 11 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఆసక్తి ఉన్న వారు 97007 75220, 92471 53387ను సంప్రదించి ముందస్తుగా పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. నేషనల్ ఇన్‌స్ట్రక్టర్, ఫిడే ఆర్బిటర్ ఎన్.ఎం.ఫణికుమార్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు జరుగుతాయని తెలిపారు.

సంక్రాంతి పండగకు రోజూ పది బస్సులు

ఆటోనగర్(విజయవాడతూర్పు): సంక్రాంతి పండగను దృష్టిలో ఉంచుకుని ప్రయాణికుల సౌకర్యార్థం ఆటోనగర్ ఆర్టీసీ డిపో నుంచి ఈ నెల 10 నుంచి 19వ తేదీ వరకు రోజూ 10 బస్సుల చొప్పున వివిధ సుదూర ప్రాంతాలకు నడుపుతున్నట్టు డీఎం ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన మంగళవారం సాక్షితో మాట్లాడుతూ సంక్రాంతి రద్దీని తగ్గించేందుకుగాను సుదూర ప్రాంతాల నుంచి సొంత గ్రామాలకు వచ్చేవారి కోసం హైదరాబాద్, విశాఖపట్నం, మద్రాస్, రాయచోటి, బెంగళూరుకు ఇక్కడి నుంచి బస్సులను నడుపుతున్నట్టు పేర్కొన్నారు. అంతే కాకుండా అన్ని వేళలా ప్రయాణికులకు అందుబాటులో సిబ్బంది ఉంటారన్నారు. రిజర్వేషన్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇక్కడి నుంచి అన్ని సూపర్‌లగ్జరీ బస్సులను నడుపుతున్నట్టు చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



శ్యాంకుమార్ మృతదేహం

కృష్ణలంక(విజయవాడ తూర్పు): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు బస్టాండ్ పక్కనే ఉన్న బాలాజీ హోటల్ వద్ద ఒక వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్నాడని హోటల్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడ్ని పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. అతని వద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా అతని పేరు టి.శ్యాంకుమార్(33) అని, కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరు సిటీకి చెందిన వ్యక్తిగా గుర్తించారు. అంతకు మించి అతని వివరాలు ఏమి తెలియవని, మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని మార్చురీకి తరలించినట్లు పోలీసులు తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న కొల్లూరి తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): చలిలో వణుకుతూ ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న యాచకులకు సామాజిక బాధ్యతగా దుప్పట్లు పంపిణీ చేస్తున్నామని ఎక్స్ రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి అన్నారు. ఎక్స్ రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ, ఎక్స్ రే వాకర్స్ క్లబ్, లయన్స్ క్లబ్ ఆఫ్ అంజలి, దుర్గా తేజ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం తెల్లవారుజామున నగరంలోని పలుప్రాంతాల్లో ఉన్న యాచకులకు దుప్పట్లు పంపిణీ చేశారు. రాత్రి సమయంలో దుప్పట్లు పంచడం సంతృప్తిగా ఉందని ఎక్స్ రే కార్యదర్శి బి.ఆంజనేయరాజు అన్నారు. కార్యక్రమంలో సుబ్బయ్య, ఏడుకొండలు, డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్, జయశ్రీ, కనకవల్లి, భాను, రాము పాల్గొన్నారు.

జనసేన పార్టీకి ఒంటరిగా పోటీ చేసే ధైర్యం లేదు

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): జనసేన పార్టీకి రాష్ట్రంలో ఒంటరిగా పోటీ చేసే ధైర్యం లేదని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం 34వ డివిజన్ కేదారేశ్వరపేట 5, 6, 7 లైన్‌లలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్, ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బండి నాగేంద్ర పుణ్యశీలతో కలసి ఆయన పర్యటించారు. డివిజన్‌లోని పలు వీధుల్లో తిరిగి ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అర్హులైన వారికి పథకాలు అందకపోతే సచివాలయంలో వలంటీర్ల దృష్టికి లేదా స్థానిక కార్పొరేటర్ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. రోడ్లు, డ్రెయినేజీ సమస్యలు పరిష్కారానికి కృషిచేశామన్నారు. డివిజన్‌లో వీఎం రంగా కమ్యూనిటీ హాల్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. 11 మందిని బలితీసుకున్న చంద్రబాబు నాయుడును పవన్ కల్యాణ్ సత్కరించడం విడ్డూరంగా ఉందన్నారు. జనసేన నాయకుడికి ఒక విజన్ లేదన్నారు. ఆయనకు ఆ పార్టీని నడిపించే లక్షణాలు, ధైర్యం లేవన్నారు. అందుకే పొత్తుల కోసం వెంపర్లడుతున్నారన్నారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు మాబు, రంగారావు, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కేదారేశ్వరపేటలో స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెలంపల్లి

సంక్రాంతి సంబరాలు

విద్యాసంస్థల్లో ఆకట్టుకున్న చిన్నారుల ఆటపాటలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని వివిధ విద్యాసంస్థలలో మంగళవారం జరిగిన సంక్రాంతి సంబరాలు ఆకట్టుకున్నాయి. చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారు.

ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్లో..

వన్‌టౌన్‌లోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకాయి. ప్రధానంగా 50వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బంకా విజయ ముఖ్యఅతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. చిన్నారులు, సిబ్బంది భోగి మంటలు, శాస్త్రీయ నృతాలు, భోగిపళ్లు, ముగ్గుల పోటీలతో సందడి చేశారు. పాఠశాల హెచ్‌ఎం రఫీఉన్నీసా పాల్గొన్నారు.

కూరపాటిలో..

పాతబస్తీ కూరపాటి చంద్రశేఖరరావు పాఠశాలలో సంక్రాంతి సంబరాలను పాఠశాల హెచ్‌ఎం డాక్టర్ గానుగుల యుగంధరాచార్య ఆధ్వర్యంలో నిర్వహించారు. తెలుగు వారి సంస్కృతీ, సంప్రదాయాలను తదుపరి తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందన్నారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు, గాలి పటాలు, బొమ్మల కొలువులు తదితర పోటీలను నిర్వహించారు.



భోగిమంటలతో సందడి చేస్తున్న బంకా విజయ ఇతర టీచర్లు



గాలిపటాలతో సందడి చేస్తున్న విద్యార్థులు

కవిత్వం సామాజిక అంశాల సమాహారం

విజయవాడ కల్చరల్: కవిత్వం సామాజిక అంశాల సమాహారమని, కవిత్వంలో ప్రజావేదన కనిపించాలని ఆచార్య కొలకలూరి స్వరూపరాణి అన్నారు. మద్దూరి బహుజన రచయితల వేదిక, దళిత చైతన్య స్రవంతి, సామాజిక న్యాయపోరాట సమితి ఆధ్వర్యంలో బందరురోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో మంగళవారం మద్దూరి నగేష్‌బాబు స్మారక పురస్కార సభను నిర్వహించింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న స్వరూప రాణి మాట్లాడుతూ కవి సమాజంలోని అసమానతలపై ధిక్కారస్వరం వినిపించాలని సూచించారు. కవి నగేష్ బాబు తన కవిత్వం ద్వారా దళితులు ఇతర బడుగు బలహీన వర్గాలవారిపై తన స్వరం బలంగా వినిపించారన్నారు. పురస్కార కమిటీ కన్వీనర్ తంగిరాల సోని మాట్లాడుతూ న్యాయనిర్ణేతల నిర్ణయం మేరకు నగేష్‌బాబు స్మారక పురస్కారానికి ఆధునిక కవిత్వంలో కృషిచేసిన వారిని పురస్కారాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. సాహితీ విమర్శకుడు కే లక్ష్మీనరసయ్య సాహితీవేత్త శిఖా ఆకాష్, చప్పిడి కోటేశ్వరరావు ప్రసంగించారు. 2022 సంవత్సరానికి గానూ మద్దూరి నగేష్‌బాబు స్మారక ప్రధాన పురస్కారాన్ని పీ శ్రీనివాస గౌడ్ రచించిన ధైర్య వచనం కవితా సంపుటికి, స్ఫూర్తి పురస్కారాలకు సరికొండ నరసింహరాజు నెత్తుటిపాదాలు, డాక్టర్ గూటం స్వామి కవితా సంపుటి తిప్పుడు పొట్లాం, అవనిశ్రీ కవితా సంపుటి ధిక్కార ఖడ్గం , అమూల్యాచందు ఒంటిరొమ్ముతల్లి, సుంకర గోపాల్ రచించిన మానాయన పాటకు పురస్కారాలను అందజేశారు.



సభలో మాట్లాడుతున్న చల్లపల్లి స్వరూపరాణి

సంక్రాంతిని సంతోషంగా జరుపుకోవాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సంక్రాంతి పండగను ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలనే భావనతో సిబ్బంది అందరికీ దుస్తులు అందజేయడం అభినందనీయమని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. చిట్టినగర్ గౌతమ్ హైస్కూల్ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ, స్కూల్ సిబ్బందికి నూతన వస్త్రాల అందజేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తొలుత కేక్ కట్ చేసి, నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సామాజిక స్పృహ కలిగిన స్కూల్ అధినేత నల్లాని సూర్యారావు ప్రతి ఏటా సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని సిబ్బందిని నూతన వస్త్రాలు, ఆర్థిక సాయాన్ని అందచేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ తులసీ, ఉపాధ్యాయులు శ్రీరామ్, మధులత, రమ, ఉమా, రేష్మా, యమున, అనురాధ పాల్గొన్నారు.

దాతల సహకారంతో 400 సేవా కార్యక్రమాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): దాతల సహాయ, సహకారాలతో 400 సేవా కార్యక్రమాలను పూర్తి చేసుకున్నామని విద్యాధరపురం కబేళా సెంటర్ బ్రహ్మయ్యకాలనీకి చెందిన వెంకట్ మహేశ్వర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముత్తంశెట్టి దుర్గా కిషోర్ తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని మంగళవారం శ్రీసాయి అన్న క్షేత్రం, శ్రీసాయిబాబా మందిరం వ్యవస్థాపకులు మహేష్ బాబా సహకారం, ప్రోత్సాహంతో ఊర్మిళానగర్‌లోని సిద్దెం కృష్ణారెడ్డి మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశామని పేర్కొన్నారు. తన తండ్రి పేరుతో స్థాపించిన ఈ ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులకు సహాయపడటం, అనాథలు, నిరాశ్రయులకు అన్నదానం చేయడం గర్వంగా ఉందన్నారు. పాఠశాల హెచ్‌ఎం తాతారావు మాట్లాడుతూ ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు అభినందనీయులన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎం.చక్రవర్తి, వైదేహి, పద్మ, జయశ్రీ, శైలజ, సౌజన్య, ట్రస్ట్ సెక్రటరీ విజయలక్ష్మి, సేవకులు శిఖామణి, వినయ్, లక్ష్మీ శ్రీనివాస్, శిరీష, చిరంజీవి, చష్విత పాల్గొన్నారు.



నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న విజయలక్ష్మి, హెచ్‌ఎం తాతారావు, దుర్గా కిషోర్

మధురస్వరాల గాయకుడు జేసుదాసు

విజయవాడ కల్చరల్: మధురస్వరాల గాయకుడు జేసుదాసు అని సీనియర్ గాయకుడు దండు చంద్రశేఖర్ అన్నారు. చంద్రశేఖర్ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికమీద మంగళవారం సినీ సంగీత దర్శకుడు నేపథ్య గాయకుడు జేసుదాసు జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమాలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ భారతీయ భాషలన్నింటిలోనూ పాటలు పాడిన అద్భుత గాయకుడు జేసుదాసు అని తెలిపారు. అయ్యప్పస్వామి మీద ఆయన పాడిన పాటలు చరిత్రలో చిరస్థాయిగా నిలచిపోయాయని, కేంద్ర ప్రభుత్వం ఆయనకు భారతరత్న పురస్కారంతో సత్కరించాలని కోరారు. పలువురు గాయకులు జేసుదాసు గానం చేసిన పాటలను ఆలపించారు. విలాన్ బనియన్ అధినేత తటవర్తి సూర్యనారాయణ, జిలానీఖాన్, చారిత్రక పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి పాల్గొన్నారు.



జేసుదాసు గీతాలు పాడుతున్న దండు చంద్రశేఖర్, రూపాశ్రీ తదితరులు

దంత సమస్యలపై అవగాహన ఉండాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రతి ఒక్కరూ దంత సమస్యలపై అవగాహన పెంచుకోవాలని డాక్టర్ సుధా అండ్ నాగేశ్వరరావు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కూన వందన అన్నారు. కేబీఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాలు, తిరుమల ఆర్థో అండ్ డెంటల్ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు, సిబ్బందికి దంత వైద్య శిబిరాన్ని ఆ కళాశాల ప్రాంగణంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కూన వందన మాట్లాడుతూ దంత సమస్యలపై చాలా మంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారన్నారు. దానివలన మరిన్ని సమస్యలు ఉత్పన్నమై ఇతర ఆరోగ్య సమస్యలకు దారి తీస్తాయన్నారు. దంతాలు ఏ విధంగా శుభ్రం చేసుకోవాలి, ఎలా వాటిని పరిరక్షించుకోవాలనే అంశాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు మాట్లాడుతూ దంతల పట్ల చాలా మంది పెద్దగా శ్రద్ధ చూపరన్నారు. దానివలన చాలా మంది దంతక్షయంతో బాధపడుతుంటారన్నారు. వాటి అవశ్యకతను విస్మరించవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామ్ ఆఫీసర్లు వీఎస్‌రావు, డీ పవన్‌కుమార్, ఎస్.సాంబశివరావు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్ పాల్గొన్నారు.



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ వందన

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయండి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): బెంగళూరులో ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకూ జరగనున్న సీఐటీయూ జాతీయ 17వ మహాసభలు జయప్రదం చేయాలని ఆ సంఘం సెంట్రల్ సిటీ అధ్యక్షుడు కె.దుర్గారావు కోరారు. సింగ్‌నగర్ కృష్ణా హోటల్ సెంటర్‌లో సీఐటీయూ జెండాను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్ని రంగాల అసంఘటిత ఉద్యోగ, కార్మికుల సమస్యలపై ఐక్యంగా పోరాడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదాని, అంబానిలాంటి బడా పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం పనిచేస్తూ, కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, ఉద్యోగస్తులు ఐక్యంగా పోరాడాలని కోరారు. పౌర సంక్షేమ సంఘం నాయకులు బి.రమణారావు, ఎం.బాబూరావు, పవన్‌కుమార్, నిజాముద్దీన్ పాల్గొన్నారు.



జెండావిష్కరించి కార్మికులతో మాట్లాడుతున్న దుర్గారావు

నేడు బీఎస్ఎన్ఎల్ మెగా మేళా

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉమ్మడి కృష్ణా జిల్లాలో బుధవారం బీఎస్ఎన్ఎల్ మెగా మేళా నిర్వహించనున్నట్లు బీఎస్ఎన్ఎల్ బిజినెస్ ఏరియా జనరల్ మేనేజర్ వై రవీంద్రనాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేళాలో బీఎస్ఎన్ఎల్ కొత్త ల్యాండ్‌లైన్, బ్రాడ్‌బ్యాండ్, ఎఫ్‌టీటీహెచ్, ఫ్రీ సిమ్ కార్డులు లభిస్తాయని పేర్కొన్నారు. అలాగే బీఎస్ఎన్ఎల్ ఫ్రాంచైజీలు ఉచితంగా బీఎస్ఎన్ఎల్ సిమ్ ఇవ్వడంతో పాటు ఆకర్షణీయమైన ఫస్ట్ రీచార్జి సదుపాయం కల్పిస్తారని తెలిపారు. ఈ సదవకాశాన్ని ఉమ్మడి కృష్ణాజిల్లా వాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

● పండగ కళ

సంక్రాంతి సందర్భంగా నగరంలో పలుచోట్ల మన సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా సెట్టింగ్స్ ఏర్పాటు చేశారు. బందరు రోడ్డులో ఓ వ్యాపార సంస్థ ఎదుట ఎడ్ల బండ్లు, హరిదాసులు, పండగకు ముస్తాబైన పూరిగుడిసెలు తదితర సెట్టింగ్స్ ఆకట్టుకుంటున్నాయి.

-సాక్షిఫొటోగ్రాఫర్, విజయవాడ





మెగా జాబ్ మేళాలో 56 మందికి ఉద్యోగాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గాంధీనగర్‌లోని శారదా కళాశాల్లో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. జాబ్‌మేళాలో 125 అభ్యర్థులు హాజరు కాగా 56 మంది వివిధ కంపెనీలలో ఉద్యోగాలు పొందారు. జాబ్‌మేళాలో విప్రో, యలమంచిలి సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పోర్టు ప్రైవేట్ లిమిటెడ్, టెలీపెర్ఫార్మెన్స్, ఇన్నోవా సాఫ్ట్‌వేర్ వంటి 12 కంపెనీలు తమకు కావాల్సిన అభ్యర్థులను ఎంపిక చేసుకున్నారు. జాబ్‌మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు కళాశాల కరస్పాండెంట్ అండ్‌సెక్రటరీ కుందా సీతారామ శాస్త్రీ చేతుల మీదుగా అపాయింట్‌మెంట్ లెటర్స్ అందజేశారు. ప్రిన్సిపాల్ నాగేశ్వర శర్మ మాట్లాడుతూ కళాశాలలో ప్రతి ఆర్నెల్ల కోసారి జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. మేళాలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఆర్ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.



అపాయింట్‌మెంట్ లెటర్స్ అందజేస్తున్న కుందా సీతారామశాస్త్రి

గోదాదేవికి విశేష అర్చనలు



దావాజి గూడెం (గన్నవరం): మండలంలోని దావాజి గూడెంలో శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా మంగళవారం కూడారై పాశుర గానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎన్.రామాచార్యులు నేతృత్వంలో తెల్లవారుజామున శ్రీకృష్ణస్వామికి, శ్రీగోదాదేవి అమ్మవారికి విశేష అర్చనలు జరిపారు. అనంతరం 108 గంగాళాల పాయసంను స్వామివారికి నివేదించారు. వేడుకలో భాగంగా శ్రీకృష్ణస్వామికి, శ్రీగోదాదేవి అమ్మవారికి పూలతో జరిపిన ప్రత్యేక అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

అన్ని రంగాల్లో రాణించేలా శిక్షణ

పటమట(విజయవాడతూర్పు): బాల్యం నుంచే అన్ని రంగాల్లో రాణించేలా చిన్నారులకు శిక్షణ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ సచివాలయం చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ హదస్సా విజయసేన పేర్కొన్నారు. పటమట ఎన్ఎస్ఎం స్కూల్లో కిండర్‌గార్డెన్ వార్షికోత్సవం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు ఆసక్తి కలిగిన అంశాల్లో తర్ఫీదు ఇవ్వాలన్నారు. మరో అతిథి గుడివాడ ఏరియా ఆస్పత్రి వైద్యులు డాక్టర్ యధిద్యా దేవర మాట్లాడుతూ చిన్నారులను ఉన్నతులుగా తీర్చిదిద్దితే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాయప్పరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ బాలారెడ్డి, కరస్పాండెంట్ మోంటీ పాల్గొన్నారు.



చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి ప్రీతికరమైన రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని, ఆలయ చైర్మన్ కనపర్తి కొండలరావు పర్యవేక్షించారు.

50 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

తిరువూరు: రాజుపేటలోని ఓ రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన 50 క్వింటాళ్ల బియ్యాన్ని పౌరసరఫరాల అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. పీడీఎస్ డిప్యూటీ తహసీల్దార్ శ్వేత తెలిపిన వివరాల ప్రకారం... రైస్‌మిల్లులో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసినట్లు అందిన సమాచారం మేరకు దాడి నిర్వహించామని తెలిపారు. ఇందుకు బాధ్యులైన హరికృష్ణ, రాజు అనే వ్యక్తులపై కేసు నమోదు చేశామని చెప్పారు. 6–ఏ సెక్షన్ కింద కేసు నమోదుచేసినట్లు పేర్కొన్నారు.



తిరువూరులోని రైస్‌మిల్లులో నిల్వచేసిన రేషన్ బియ్యం

వైఎస్సార్ హెల్త్ క్లినిక్ పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ అమలు తీరు పరిశీలనలో భాగంగా జగ్గయ్యపేట మండలంలోని బూచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బూదవాడ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను పరిశీలించారు. ఈ పర్యటనలో స్థానికంగా నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో ఏఎన్‌సీ, పీఎన్‌సీ రిస్క్ గర్భిణులకు అందిస్తున్న సేవలుపై ఆరా తీశారు. ఏఎన్ఎంల యాప్ లలో వివిధ సేవలు నమోదు విధానంపై పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందిస్తున్న సేవలను తనిఖీ చేసి, సూచనలు చేశారు. కార్యక్రమంలో బూచవరం వైద్యాధికారి డాక్టర్ స్రవంతి పాల్గొన్నారు.



బూదవాడలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ